## వైభవంగా యాదగిరీశుడి కల్యాణోత్సవం

యాదగిరిగుట్ట, మార్చి 8 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం శనివారం రాత్రి పాంచరాత్రగమ శాస్త్రరీతిలో వైభవంగా జరిగింది. లక్ష్మీనరసింహుడిని గజ వాహనంపై, అమ్మవారిని పూల పల్లకిలో కల్యాణ వేదికకు తీసుకువచ్చారు. రాత్రి 8.45 గంటలకు స్వయంభూ ప్రధానాలయం ఉత్తర మాఢవీధుల్లో నెలకొల్పిన ప్రత్యేక వేదికపై వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ తంతు నిర్వహించారు. యాదగిరిగుట్ట నరసింహస్వామి లోక కల్యాణార్థం సముద్ర తనయ మహాలక్ష్మి అమ్మవారి మెడలో రాత్రి 10.47 గంటలకు తుల లగ్న సుమూర్తంలో మాంగళ్యధారణ చేశారు. కల్యాణోత్సవం సందర్భంగా ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి, ఆలయం తరపున ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు సమర్పించారు. కల్యాణ మహోత్సవాన్ని ప్రధానార్చకులు నల్లన్‌ధీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం నరసింహస్వామిని శ్రీరామ అలంకారంలో హనుమంత వాహనంపై తిరుమాఢవీధుల్లో ఊరేగించారు.



కల్యాణ తంతులో స్వామి, అమ్మవారు

### మంత్రుల గైర్హాజరు..

తెలంగాణ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం తరపున మంత్రులు హాజరై పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తున్నది. కాగా, ఈసారి కల్యాణోత్సవానికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి గానీ, ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రులు గానీ హాజరు కాలేదు.

### నేడు దివ్య విమాన రథోత్సవం

ఆదివారం ఉదయం 9గంటలకు మహావిష్ణు అలంకారంలో గరుఢ వాహనంపై లక్ష్మీనరసింహస్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి 8గంటలకు దివ్య విమాన రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. తిరుమాఢవీధుల్లో స్వామివారి ర థంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.



స్వామి వారి కల్యాణానికి హాజరైన భక్త జనం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు, జూనియర్ లెక్చరర్స్ ఉద్యోగం వచ్చిన అభ్యర్థులు

## జూనియర్ లెక్చరర్లకు పోస్టింగ్ ఇవ్వాలి

### నల్లగొండలో మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ


రామగిరి, మార్చి 8 : కొత్తగా నియామకమైన జూనియర్ లెక్చరర్లకు పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను నల్లగొండలోని గడియారం సెంటర్‌లో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి ఎడ్ల సైదులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం ఆధ్వర్యంలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ లెక్చరర్స్ నోటిఫికేషన్ 2022లో వచ్చిందని, 2023లో పరీక్షలు నిర్వహించి 2024లో ఫలితాలు విడుదల చేశారని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 19నాటికి కళాశాలలు కేటాయించారని, అయినప్పటికీ ఎంపికైన అభ్యర్థులకు అపాయింట్‌మెంట్, పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వలేదన్నారు. దాంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన అభ్యర్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ఈ నెల 11న ఇందిరాపార్కు వద్ద చేసే ధర్నాకు అభ్యర్థులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో టీపీఆర్ఏ జిల్లా గౌరవాధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.



## మార్చిలోనూ మంచు దుప్పటి

చివ్వెంల మండల కేంద్ర శివారులో కమ్ముకున్న పొగ మంచు

చివ్వెంల, మార్చి 8 : సాధారణంగా సెప్టెంబర్ నుంచి జనవరి నెలల మధ్య మంచు కురుస్తూ ఉంటుంది. సంక్రాంతి తర్వాత వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటాయి. కానీ.. ఇందుకు భిన్నంగా మార్చిలోనూ కొన్ని ప్రాంతాల్లో మంచు దుప్పటి కప్పేస్తుంది. శనివారం ఉదయం చివ్వెంల మండల కేంద్రంతో పాటు బీబీగూడెం, అక్కలదేవిగూడెం, సూర్యాపేట – ఖమ్మం రహదారిపై దట్టంగా మంచు కమ్మేసింది. లైట్లు వేసుకున్నా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పలేదు. ఉదయం 8గంటలు అయినా మంచు వదలకపోవడంతో ఇదెక్కడి కాలమని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఇటీవల రాష్ట్రంలో విచిత్ర వాతావరణం నెలకొన్నది. ఉదయం, సాయంత్రం చలి గాలులు వీస్తుండగా మధ్యాహ్నం ఎండ వేడిమితో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.



ఆమె సేవలకు ఆత్మీయ సన్మానం

మహిళా దినోత్సవం సందర్భంగా నల్లగొండలో మున్సిపల్ మహిళా కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సతీమణి రమాదేవి

# కాళేశ్వరం అప్పగించండి.. మూడో రోజే నీళ్లిస్తాం

### మీకు చేతగాకపోతే కేసీఆర్ చేతికి అందించాలి

### సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సవాల్

- నూతనకల్‌లో ఎండిన పంటల సందర్శన
- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌తో కలిసి పరిశీలన
- గోదావరిలో నీళ్లు ఉన్నా ఇసుక దందా కోసమే ఇవ్వడం లేదని మండిపాటు
- కండ్ల నీళ్లు తీస్తూ ఎండిన పంటలను చూపించిన రైతులు
- నీళ్లివ్వకుంటే రైతుల కోసం పోరాటం : ఎమ్మెల్యే కిశోర్ కుమార్

నూతనకల్, మార్చి 8 : 'సుభిక్షంగా ఉండాల్సిన రైతులు వేసిన పంటలు ఎండి దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మీకు చేతగాకపోతే కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ చేతికి అప్పగించండి. మూడో రోజే ఎస్సారెస్పీ కాల్వలకు నీళ్లు ఇచ్చి చూపిస్తం' అంటూ సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. ఎస్సారెస్పీ కాల్వలకు నీళ్లు లేక నూతనకల్ మండల కేంద్రంలో ఎండిన వరి పంటలను తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌తో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు కేసీఆర్ పాలనలో పుష్కలంగా నీళ్లు రావడంతో ఏ రందీ లేకుండా పంటలు పండించామని, ఇప్పుడు కాల్వలకు నీళ్లే రావడం లేదని వాపోయారు. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిన పంటలు పొట్ట దశలో చేతికి అందకుండా పోతున్నాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు అయిన రైతులు సైతం కాంగ్రెస్‌కు ఓటుకు వేసి కష్టాలు కొనితెచ్చుకున్నట్టు ఉందని, కేసీఆర్ పాలనలోనే వ్యవసాయం బాగుందని కండ్ల నీళ్లు తీస్తూ చెప్పుకొచ్చారు. రైతుల కష్టాలు చూసి చలించిన జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌పై ఉన్న కోపంతో కాళేశ్వరం నీళ్లు విడుదల చేయకుండా రేవంత్ సర్కారు రైతులకు అన్యాయం చేస్తున్నదన్నారు. బీఆర్ఎస్ హయాంలో తుంగతుర్తి నియోజకవర్గంలో రెండు పంటలకు ఎస్సారెస్పీ జలాలను విడుదల చేయించి ఒక్క గుంట పొలం కూడా ఎండిపోకుండా చూశామని గుర్తుచేశారు. నేడు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు దోచుకోవడానికే సమయం వెచ్చిస్తున్నారు తప్ప.. రైతు సమస్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకునే సోయి లేదని విమర్శించారు. నియోజకవర్గంలోని 69వ డీబీఎం కాల్వకు ఇరువైపులా ఉన్న పంట పొలాలు ఎండిపోతుండడం శోచనీయమన్నారు. ఈ సంవత్సరం కూడా గోదావరికి పుష్కలంగా వరద వచ్చిందని, ఆ నీళ్లన్నీ ఎటుపోయాయని ప్రశ్నించారు. రైతు భరోసా రూ.15వేలు, వడ్లకు బోనస్, రూ.2లక్షల రుణమాఫీ, చివరి ఆయకట్టు వరకు రెండు పంటలకు నీళ్లు ఇస్తామంటే నమ్మి ఓటేసిన రైతులను కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి టైమ్ ఇస్తే ఎండిన పొలాలను చూపించడానికి బీఆర్ఎస్ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆంధ్రాకు గోదావరి జలాలు తీసుకుపోతామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించినా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. రైతుల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వారి సమస్యలను పట్టించుకోకుండా పట్టణ ప్రాంతాలకు పరిమితమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులకు సరైన సమయంలో తగిన బుద్ధి చెప్పేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.



నూతనకల్‌లో ఎండిన పొలాన్ని పరిశీలించి రైతు గోడు వింటున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్



పక్కనే ఎస్సారెస్పీ కాల్వ ఉన్నా నీళ్లు లేక పొట్ట దశలో ఎండిపోతున్న వరి పైర్లు



తన పొలానికి రెండు వైపులా ఎస్సారెస్పీ కాల్వ ఉన్నా నీళ్లు రాక ఐదెకరాల పంట ఎండిపోయిందని కంట తడి పెట్టిన కాంగ్రెస్ అభిమాని, రైతు సాబాది మల్లారెడ్డి

మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనూ నీళ్లు లేక పంటలు ఎండిన దాఖలాలు లేదన్నారు. నేడు గోదావరి జలాలు రావడం లేదని స్వయంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన రైతులే రోడ్లపై ధర్నాలు చేస్తున్న పరిస్థితి నెలకొందని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. లేకుంటే రైతులతో కలిసి పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్ఏ రజాక్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య, మాజీ జడ్పీటీసీలు గుగులోతు నర్సింగ్‌నాయక్, జీడి భిక్షం, నాయకులు గాజుల తిరుమలరావు, బిక్కి బుచ్చయ్య, బత్తుల విద్యాసాగర్, లింగరాజు, పరమేశ్, బాబు, విజయ్, వీరుయాదవ్, వెంకన్న, మహేశ్ పాల్గొన్నారు.

### మళ్లీ కేసీఆర్ వస్తేనే మా తలరాతలు మారుతాయి

సారూ.. పొరపాటు జరిగింది. మళ్లీ కేసీఆర్ వస్తేనే మా తల రాతలు మారుతాయని పలువురు రైతులు పేర్కొన్నారు. రెండు పంటలకు కాళ్వేశరం జలాలతో పాటు రైతు బంధు, 24 గంటల ఉచిత విద్యుత్ బీఆర్ఎస్ పాలనలోనే అందాయని గుర్తుచేసుకున్నారు. కాంగ్రెస్ పాలనలో నీళ్లు లేవు.. పంటకు పెట్టుబడి లేదు.. రైతు బీమా లేదు.. సన్న వడ్లకు బోనస్ లేదు అని వాపోయారు. పచ్చి అబద్ధాలు చెప్పి తమను మోసం చేసి అధికారంలోకి వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

## లంచాలు.. కమీషన్ల ప్రభుత్వం ఇది

- ప్రభుత్వ దిగజారుడుకు నిదర్శనం ఆర్థిక శాఖ మంత్రి చాంబర్ ఎదుట కాంట్రాక్టర్ల ధర్నా
- బిల్లుల చెల్లింపులపై శ్వేత పత్రం విడుదల చేయాలి
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : 15 నెలల క్రితం అధికారంలోకి వచ్చినా పాలనను గాడిన పెట్టలేని కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం లంచాలు, కమీషన్ల ప్రభుత్వంగా మారిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బిల్లులు చెల్లించకుండా నెలల తరబడి తిప్పించుకుంటున్నారని, కమీషన్లు ఇస్తే వెంటనే బిల్లులు చెల్లిస్తున్నారని ఏకంగా సెక్రటేరియట్‌లోని ఆర్థిక శాఖ మంత్రి చాంబర్ ముందు కాంట్రాక్టర్లు ధర్నాకు దిగడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. సూర్యాపేటలోని క్యాంప్ ఆఫీసులో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. నేడు రాష్ట్రంలో అరాచకమైన పరిస్థితి నెలకొందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు పక్కన పెడితే గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన పథకాలు, సౌకర్యాలను కొనసాగించే స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి ప్రణాళిక లేదని, కేవలం డబ్బులు దోచుకోవడం, లంచాలు, కమీషన్ల కోసమేనన్నట్లు వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. చేసిన పనులకు బిల్లులు తీసుకునేందుకు కాంట్రాక్టర్లు రూట్లు దేవులాడుకుంటున్నారని, పది నుంచి 20శాతం వరకు కమీషన్లు అడగడం దుర్మార్గమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎంత బుకాయించాలన్నా, తప్పించుకోవాలన్నా తప్పించుకోలేని స్థితికి చేరుకున్నారన్నారు. గతంలో కర్ణాటకలో బహిరంగంగా కమీషన్ తీసుకోవడంతో అక్కడి ప్రభుత్వాన్ని ప్రజలు మార్చారని, దురదృష్టవశాత్తు తెలంగాణలోనూ అదే కమీషన్ల వ్యవస్థ కొనసాగుతుందని తెలిపారు. ఎక్కువ కమీషన్ వస్తుందని పెద్ద కాంట్రాక్టర్లు కొద్దిమందికి మాత్రమే బిల్లులు ఇస్తున్నట్లు చిన్న కాంట్రాక్టర్లు వాపోతున్నారని, ఇది ఎంత వరకు సమంజసమో ప్రభుత్వం ఆలోచించాలని హితవు పలికారు. ఈ కమీషన్ల అంశం సహా ప్రభుత్వ వైఫల్యాలపై అసెంబ్లీలో నిలదీస్తామన్నారు. కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వానికి ఏమీ చేతకాదని, ప్రజలను చంపడమే గానీ బతికించడం చేతనవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 15రోజులుగా గోడలకు చెవులు పెట్టి విని రావడం తప్ప ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ఏమీ చేయలేదన్నారు. ఇతర రాష్ట్రాల కార్మికులు కావడంతో వస్తే వచ్చింద్రు.. లేదంటే పోయింద్రు అన్నట్లు ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని జగదీశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నీళ్లు.. నిధులు కావాలె..

### డీఆర్‌సీ సమావేశంలో మంత్రుల ఎదుట ఎమ్మెల్యేల ఏకరువు

- గతేడాది చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుంటే పనులెలా చేయించాలంటూ ప్రశ్నలు
- పలు సమస్యలు లేవనెత్తినా స్పందించని మంత్రులు
- అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలంటూ సమావేశం ముగించిన మంత్రులు



డీఆర్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్లు

నీలగిరి, మార్చి 8 : నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో శనివారం జరిగిన ఉమ్మడి జిల్లా డీఆర్‌సీ సమావేశంలో పలు సమస్యలను ఎమ్మెల్యేలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎదుట ఏకరువు పెట్టారు. సమస్యల కారణంగా ప్రజల్లోకి వెళ్లలేక పోతున్నామని, రైతులు, ప్రజలు నిలదీస్తున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచులు లేక నిధుల కొరత కారణంగా పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు నల్లా ట్యాప్‌లు సైతం పెట్టలేకపోతున్నారని మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో తాగునీరు లేదని ఖాళీ బిందెలతో ప్రజలు, పంటలు ఎండుతున్నాయని రైతులు నిలదీస్తున్నారని పేర్కొన్నారు. గతేడాది చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో వారితో ఇప్పుడు పనులు ఎలా చేయించాలని ప్రశ్నించారు. అయితే.. సభలో ఏర్పాటు చేసిన మైకు పనిచేయకపోవడంతో ఎమ్మెల్యేలు మైకు లేకుండానే మాట్లాడారు. ప్రశ్నించిన ఎమ్మెల్యేలకు మంత్రులు సమాధానం ఇవ్వలేదు. సీఎం దృష్టికి తీసుకెళ్తామని, అధికారులు స్థానికంగా ఉండాలని చెప్పారు.

శనివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, మూడు జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల, విద్యుత్, నీటి సరఫరా విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా, పంటలు ఎండిపోకుండా, విద్యుత్ సరఫరా సక్రమంగా కొనసాగేలా సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మిషన్ భగీరథ అధికారులు తాగునీటి ఇబ్బంది రాకుండా ఈఎన్‌సీ స్థాయిలో దృష్టి సారించాలని సూచించారు. పంటలు ఎండిపోకుండా ఇంజినీరింగ్ అధికారులు కాల్వలపై పర్యటించాలని, విద్యుత్ అధికారులతో కలిసి నీటి పర్యవేక్షణ చేయాలని అన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ తక్షణ అవసరాల కోసం ప్రతి జిల్లాకు ఐదు కోట్లు, నల్లగొండ జిల్లాకు రూ.15కోట్లు నిధులు ఉంచాలన్నారు. తాగునీటి సమస్య ఉంటే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. సాగునీటి నిర్వహణ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, విద్యుత్ అధికారులు పూర్తి స్థాయిలో సేవలు అందించాలన్నారు. జిల్లా కలెక్టర్లు తాగునీటిపై ఎక్కువ దృష్టి పెట్టాలని సూచించారు.

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ గుండాల మండలంలో 50శాతం పంటలకే నీరు వస్తుందని, మరో వారంపాటు 200 క్యూసెక్కుల నీటిని వదలాలని కోరారు. చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ, బోరు నీళ్లు కలిసిపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, బస్వాపురం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ వశీకరణ చెల్లింపులు చేపట్టాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కోరారు. మూసీలో గుర్రెపు డెక్క ఉండడంతోపాటు మోటార్లు వేయడంతో చివరి భూములకు నీరు వస్తలేదన్నారు. మూసీ పరిధిలో మోటార్లు బంద్ ఉండేందుకు రాత్రి పూట కరెంట్ కట్ చేయాలని ఆదేశాలు జారీ చేయాలన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ తమ ప్రాంతంలో వేలాది ఎకరాల్లో వరి పంట ఎండిపోతుందని, బిక్కేరు వాగు నుంచి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. ఎస్సారెస్పీ కింద బిక్కుమల్ల వరకు నీరు రావడం లేదని, కాల్వల్లో నిండిపోయిన చెత్తను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి మాట్లాడుతూ తండాల్లో కొత్త బోర్లు వేసేందుకు అనుమతులు ఇవ్వాలని, హాలియా మున్సిపాలిటీకి నీటిని అందించే నిడమనూరు చెరువును నింపాలని అన్నారు. నీటిసరఫరాలో భాగంగా క్రిటికల్ గ్యాస్‌ను పూర్తి చేసి పెండ్లిపాకల ప్రాజెక్టు కింద ఏజెన్సీ జీతాలు చెల్లించాలని, చిన్న పనులు కూడా చేయలేని దుస్థితిలో గ్రామ పంచాయతీలు ఉన్నాయని దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ అవేదన వ్యక్తం చేశారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గత ఎండాకాలంలో అద్దెకు తీసుకున్న ట్యాంకర్లకు, బోర్లకు అద్దెలు ఇవ్వలేదని, వారితో ఇప్పుడు మళ్లీ ఎలా పనులు చేయించాలని ప్రశ్నించారు. రామన్నపేట, నార్కట్‌పల్లి, చిట్యాల మండలాల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఆసిఫ్‌నెహర్ నుంచి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విన్నవించారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి మాట్లాడుతూ చివరి భూముల వరకు సాగునీరు అందించాలని, ఇరిగేషన్, అగ్రికల్చర్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల నీటి విషయంలో స్పష్టత లేదని అన్నారు. అంతకుముందు ఉమ్మడి జిల్లాలో విద్యుత్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలపై కలెక్టర్లు చర్చించారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిని మంత్రులు సన్మానించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇల్లు నమూనాను ప్రారంభించారు. సమావేశంలో కలెక్టర్లు ఇలా త్రిపాఠి, హనుమంతరావు, తేజస్ నందలాల్ పవార్, నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్, మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఎన్‌సీ హరిలాల్, చీఫ్ ఇంజినీర్ అజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ పాల్గొన్నారు.


Short Term Crash Course
EAPCET (EAMCET)/NEET-2025
Classes Starts From 24th March 2025
40 Days Coaching
బాల బాలికలకు వేర్వేరుగా Classes మరియు హాస్టల్ సదుపాయం కలదు
శ్రీ వేదాంత జూనియర్ కళాశాల
IIT-NEET ACADEMY
రామగిరి, నల్లగొండ. సెల్: 8523091246, 9948109950

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం మన పత్రిక
NAMASTE TELANGANA
- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధి అందుబాటులో ఉన్నారు సంప్రదించండి.
సెల్: 9182777625
నల్లగొండ : 9182 777 635
నకిరేకల్ : 9182 777 635
సూర్యాపేట : 9182 777 630
మిర్యాలగూడ : 9182 777 059
యాదాద్రి భువనగిరి : 9182 777 638
కోదాడ : 9182 777 630
హుజూర్‌నగర్ : 9182 777 059
హాలియా : 9182 777 059
దేవరకొండ : 9182 777 635
చౌటుప్పల్ : 9182 777 638